క్లుప్తంగా

శ్రీవారి సేవలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి



హర్షవర్ధన్‌కు శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి కె.హర్షవర్ధన్, పద్మావతి(ఐఏఎస్) దంపతులు శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి స్వామివారి మొమెంటో, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి పథకాలకు రూ.లక్ష విరాళం

శ్రీవారి పథకాలకు ఒక భక్తుడు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వెంపడ సురేష్, శ్రీలత దంపతులు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ.50 వేలు, విద్యాదాన పథకానికి రూ.50 వేలను ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభించిన శాంతరావు, వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం : అయ్యపరాజుగూడెం నుంచి ప్రగతిపురం వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం లింగపాలెం మండల సచివాలయ కన్వీనర్, అయ్యపరాజుగూడెం పంచాయతీ ఉప సర్పంచ్ అన్నపనేని శాంతరావు ప్రారంభించారు. ఈరోడ్డు పునర్నిర్మాణ పనులకు ఏఐఐపీ 1బీ గ్రాంటు నుంచి రూ.కోటి 5 లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులతో 3.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించటంతో ఎంతోకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య తీరనుందన్నారు.

ఎమ్మెల్యే తలారి అభినందనలు



గెలుపొందిన వార్డు సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ద్వారకాతిరుమల: మండలంలో శనివారం జరిగిన పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో గెలుపొందిన ఇద్దరు వైఎస్సార్ సీపీ మద్దతుదారులను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అభినందించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విజయం సాధించిన ద్వారకాతిరుమల 8వ వార్డు అభ్యర్థి నడికట్టి సీతారామాంజనేయులు, గుణ్ణంపల్లి 6వ వార్డు అభ్యర్థి ముసల నాగ రేణుక వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల నాయకులతో కలసి ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి, పూలమాలలతో సత్కరించారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే తలారికి దుశ్శాలువాను కప్పి, సత్కరించారు.

సాహితీ రంగంలో కృషి



జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద ప్రసాదరావును సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : సాహిత్య రంగంలో విశేష సేవలందిస్తున్న జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ కవులూరి ప్రసాదరావును శనివారం స్థానిక డిపోలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రసాదరావు సాహిత్యం పట్ల ఆసక్తితో పలు పుస్తకాలు, రచనలు చేశారు. ఆయన చేసిన రచనలకు గాను గత నెల 27న విజయవాడలో సాహిత్యంలో అబ్దుల్ కలాం ఇన్‌స్పిరేషనల్ అవార్డును అందుకున్నారు. అలాగే ఈ నెల 13న తెలంగాణ రాష్ట్రం హనుమ కొండలో జరిగిన కార్యక్రమంలో కాకతీయ వైభవ కీర్తి పురస్కారంతో పాటు, సాహితి చదరంగ ప్రపూర్ణ బిరుదు అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయు ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ప్రసాదరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్‌యూనియన్ తుమ్మలపల్లి నరసింహం, డిపో సెక్రటరీ గారపాటి రామారావు, డిపో అధ్యక్షుడు బీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉప పోరులో.. వైఎస్సార్ సీపీ ప్రభంజనం

- ద్వారకాతిరుమల, గుణ్ణంపల్లిలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయం
- అంబరాన్నంటిన పార్టీ శ్రేణుల సంబరాలు



ద్వారకాతిరుమలలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు సీతారామాంజనేయులకు అభినందనలు తెలుపుతున్న పార్టీ నేతలు



గుణ్ణంపల్లిలో నాగ రేణుకను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జీలుగుమిల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ధర్మరాజు, నాయకులు, కార్యకర్తలు

ద్వారకాతిరుమల : మండలంలోని రెండు గ్రామాల్లో జరిగిన పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో రెండు చోట్లా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల 8వ వార్డు అభ్యర్థి నడికట్టి సీతారామాంజనేయులు తన ప్రత్యర్థులపై 73 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. అలాగే గుణ్ణంపల్లిలోని 6వ వార్డు అభ్యర్థిని ముసల నాగ రేణుక 36 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. విజేతలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఇదిలా ఉంటే ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు సందడి చేశారు. తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు శ్రమించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గెలుపొందిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులకు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి, అభినందనలు తెలిపారు. అలాగే దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. యువకులు బాణసంచా కాల్చి సందడి చేశారు. ద్వారకాతిరుమలలో జరిగిన సంబరాల్లో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, యిమ్మడి నాగు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, అంబటి గాంధి, బొండాడ సాత్యకిరావు, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, తేలు వెంకటేశ్వరరావు, గుర్రాల లక్ష్మణ్, షేక్ భాషా, సర్పంచ్ కుంటం స్వర్ణలత, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, భోగరాజు సాయికృష్ణ, అల్లాడ హరేరామకృష్ణ, యిమ్మడి పవన్‌కుమార్ తదితరులున్నారు.

జీలుగుమిల్లిలో వైఎస్సార్ సీపీ విజయోత్సాహం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 6వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి మడకం ధర్మరాజు ఘన విజయం సాధించారు. మొత్తం 209 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారు మండకం ధర్మరాజుకు 118 ఓట్లు రాగా, కూరం బుజ్జయ్యకు 74 ఓట్లు, కెచ్చెల రమణకు 09 ఓట్లు వచ్చాయి. అలాగే 9 చెల్లని ఓట్లు ఉండగా , 5 ఓట్లు నోటాకు పడినట్లు అధికారులు తెలిపారు. కాగా 44 ఓట్ల మెజారిటీ గెలుపొందిన ధర్మరాజుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామాంజనేయులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలవరం డీఎస్పీ ఏ శ్రీనివాసులు, సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై చంద్రశేఖర్ బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

జీలుగుమిల్లి 6వ వార్డు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి మడకం ధర్మరాజు గెలుపుతో ఆ మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ధర్మరాజును ఎలాగైనా ఓడించాలని టీడీపీ నాయకులు అనేక కుయుక్తులు చేసినా వాటిని తిప్పికొడుతూ ఓటర్లు 44 ఓట్ల మెజారిటీతో ధర్మరాజును గెలిపించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు కేరింతలు కొడుతున్నారు. గెలిచిన ధర్మరాజుకు దండలు వేసి ఘనంగా ఊరేగించారు. అలాగే జగదాంబ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జగన్ నినాదంతో హోరెత్తించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా జీలుగుమిల్లి మండలంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్సా పోచమ్మ, ఎంపీటీసీ సున్నం సురేష్, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వనమా రామకృష్ణ, పార్టీ నాయకులు చందా ప్రసాద్, సూరిశెట్టి ఏసు చిట్టిబొమ్మ శ్రీను, బూరుగు ప్రేమ్‌కుమార్, కక్కిరాల చక్రి, కక్కిరాల రాము, చాట్రాతి భవాని, కొప్పుల సత్యనారాయణ, వీరంకి వెంకటేశ్వరరావు, కుసుమ వెంకట్, గోగుల రమేష్, కొప్పుల ప్రసాద్, గుడెల్లి చంద్రరావు, చిర్రి మోహన్, సింగన్నదొర, తామా పెంటయ్య, పరిశిక రమేష్, తామా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

పోలవరం రూరల్ : పోలవరం మండలం చేగొండిపల్లి పంచాయతీ పరిధిలో 6వ వార్డుకు నిర్వహించిన ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. చేగొండిపల్లి ఆశ్రమ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 106 ఓట్లకు గాను 94 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ బలపర్చిన అభ్యర్థి మూలెం రాజుకు 52 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ బలపర్చిన కారం పోశారావుకు 42 ఓట్లు పోలయ్యాయి. మూలెం రాజు ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు ధ్రువీకరణపత్రం జారీ చేశారు. పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, కార్యదర్శి రాజారావు పర్యవేక్షించారు.

లింగపాలెం మండలంలోనూ వైఎస్సార్ సీపీదే హవా



మండలపు సత్యన్నారాయణను కలిసిన వార్డు మెంబరు శాంతి లీల, పార్టీ శ్రేణులు



పాశ్యానగరంలో గెలుపొందిన పి.రమేష్

లింగపాలెం : లింగపాలెం మండలంలో రెండు గ్రామాలలో జరిగిన వార్డు మెంబర్ల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. మఠంగూడెం పంచాయతీలో జరిగిన 8వ వార్డు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదురు పిల్లి శాంతిలీల తన సమీప జనసేన మద్దతుదారుపై 61 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. పాశ్యానగరం పంచాయతీ 10వ వార్డు ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థిపై 2 ఓట్లు మెజార్టీతో వైఎస్సార్ సీపీ మద్దతుదారు పొన్నుబోయిన రమేష్ గెలుపొందారు. మఠంగూడెంలో వార్డు మెంబరుగా గెలుపొందిన పిల్లి శాంతిలీల ఊరేగింపుగా తరలి వెళ్లి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలపు సత్యన్నారాయణ ఆశీర్వచనలు పొందారు. ఇరువురు వార్డు మెంబర్లు విజయం పట్ల మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా..



లక్కవరంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనలో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లక్కవరంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన ఎలా ఉందని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఓ వైపు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, మరో వైపు వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలని, వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, సొసైటీ చైర్మన్ బడి దుర్గారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ నాయకులు వందనపు సూర్యప్రకాషరావు, చిల్ల దుర్గారెడ్డి, దల్లి నాగేశ్వరరావు, నిమ్మ రామకృష్ణ, చిట్టిబొమ్మ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా జగన్ పాలన



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి దేశం యావత్తు ప్రశంసిస్తూ, సంక్షేమ పథకాల అమలును ఆదర్శంగా తీసుకుంటుంటే దేశదిమ్మరులైన చంద్రబాబు అతని ఉత్తర, దత్తత కుమారులు లోకేష్ బాబు, పవన్ కళ్యాణ్ నిరాధార ఆరోపణలతో కాలం గడిపేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఎద్దేవా చేశారు. శనివారం కొయ్యలగూడెం వైఎస్సార్ విగ్రహం వద్ద కొల్లూరు కాంప్లెక్స్‌లో నిర్వహించిన పోలవరం నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల సమావేశానికి(జేసీఎస్) ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగనన్న సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి పేద వర్గాల ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.నాలుగు లక్షల కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు హృదయాల్లో సీఎం వైఎస్ జగన్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, దీంతో ఏ రూపేణా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఆపలేము అని తెలుసుకున్న చంద్రబాబు ఘర్షణలకు పాల్పడేలా హింసాత్మకమైన ప్రసంగాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఏర్పాటు చేసుకోవాలని నియోజకవర్గ పరిశీలకులు విజ్జు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాసరి విష్ణు, ఆరేటి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ తాడిగడప రామకృష్ణ, టౌన్ కన్వీనర్ శంకు కొండ, బుట్టాయిగూడెం వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహనరావు, సర్పంచ్‌ల ఛాంబర్ నియోజకవర్గ, మండల శాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

కామవరపుకోట : బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని సచివాలయాల శాఖ ఎస్‌బీసీసీ జిల్లా కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ తెలిపారు. రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. స్నేహన్ మాట్లాడుతూ బాల్య దశలో ఎవరికైనా వివాహాలు చేస్తుంటే 100, 112, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు బి.నాగేశ్వర్యరావు, సచివాయలం సంక్షేమ కార్యదర్శి నాగాంబిక, సంరక్షణ కార్యదర్శి పుష్పాంజలి పాల్గొన్నారు.

విలువలే ప్రధానంగా 'మానవత'

చింతలపూడి : విలువలే ప్రధానంగా మానవత స్వచ్ఛంద సంస్థ పనిచేస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖరాచార్యులు అన్నారు. మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పాతబస్టాండ్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ టి కృష్ణజ్యోతి, మానవత చైర్మన్ ఎ.అప్పారావు కన్వీనర్ కె.నాగ చిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామవరపుకోట : తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ కడిమి రమేష్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆపదలో ఉన్న ఎంతోమందిని ఆదుకుంటున్న మానవత సేవలు అభినందనీయమని అన్నారు.

వినియోగదారులతో మర్యాదగా నడుచుకోవాలి



వీరిశెట్టిగూడెం అడ్డరోడ్ పెట్రోలు బంకును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కామవరపుకోట : పెట్రోలు వినియోగదారులతో పెట్రోల్ బంకు సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. మండలంలోని వీరిశెట్టిగూడెం వద్ద ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బంకులలో ఉండే సిబ్బంది వినియోగదారులతో అమర్యాదగా మాట్లాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బంకులలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా యాజమాన్యాలు, నిర్వాహకులు తగిన ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వాహనాలలో ఆయిల్ నింపుకోవడం కోసం వాహనదారులు వస్తారని.. అటువంటి సమయాల్లో సిబ్బంది తప్పనిసరిగా ఖాతాదారుల అవసరాన్ని గుర్తించాలన్నారు. బంకుల వద్ద మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి సదుపాయం కూడా ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు.

నేర ప్రవృత్తిని విడనాడాలని హితవు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి : నేర ప్రవృత్తిని విడనాడాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు ఖైదీలకు హితవు పలికారు. చింతలపూడి సబ్‌జైల్‌ను శనివారం ఆయన సందర్శించారు. సబ్‌జైల్‌లో ఉన్న ముద్దాయిలను ఆహారం, వసతి, వైద్య సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. న్యాయవాదులను పెట్టుకునే స్థోమత లేని నిందితులు, శిక్షలు పడి అప్పీలు చేసుకునే అవకాశం ఉన్న ముద్దాయిలకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందచేస్తామని తెలిపారు. అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలనుకుంటే జైల్లో గడపాల్సి వస్తుందన్నారు. నేర ప్రవత్తికి దూరంగా ఉండి కష్టపడి పని చేసుకుని సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. సెప్టెంబర్ 9వ తేదీన కోర్టులో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ జి వెంకటేశ్వరరావు, జైల్ విజిట్ ప్యానెల్ న్యాయవాదులు బుల్లా ఏసుపాదం, సోషల్ వర్కర్ అక్బర్ ఆలి ,హెడ్ వార్డర్ సాంబశివరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

డాగూరేకి నివాళి

జంగారెడ్డిగూడెం : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జంగారెడ్డిగూడెం ఫొటో అండ్ వీడియో మిక్సింగ్ యూనిట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అశోక్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు కానుమూరి సోమరాజు, నాయకులు చండీశ్వర రావు, శ్రీను, రామయ్య, గ్రేస్ రాజు, కిరణ్ పాల్, రాజు, వెంకట్, సాయి నరేష్, జగన్, భద్రి పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి

కొయ్యలగూడెం : ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ కొయ్యలగూడెం మండల గ్రామ పంచాయతీ జనరల్ బాడీ సమావేశం ఎస్‌కే ఇస్మాయిల్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బంగారు కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ అమలుకై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఫణీంద్ర, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన సమాచారంతో రావాలని ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం : ఈ నెల 30వ తేదీన కేఆర్‌పురం ఐటీడీఏలో జరిగే పాలకవర్గ సమావేశానికి కచ్చితమైన సమాచారంతో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ అన్నారు. శనివారం ఐటీడీఏ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జరిగే పాలకవర్గ సమావేశంలో పనుల పురోగతి, అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందని, కచ్చితమైన సమాచారంతో అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వర రావు తెలిపారు. వివరాల ప్రకారం పట్టెన్నపాలానికి చెందిన పి.రాంబాబు కుమార్తె ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో యువతి తండ్రి రాంబాబు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె అదృశ్యం విషయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బండారు వీరాంజనేయులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఉపాధ్యాయురాలి మృతిపై విచారణ



జంగారెడ్డిగూడెంలో నిర్మల ఆసుపత్రిలో విచారణ నిర్వహిస్తున్న వైద్యాధికారి

జంగారెడ్డిగూడెం : ఉపాధ్యాయురాలి మృతిపై స్థానిక నిర్మల ఆసుపత్రిలో వైద్యశాఖాధికారులు విచారణ నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కృపాకుమారి మే నెలలో అనారోగ్యానికి గురికాగా స్థానిక నిర్మల ఆసుపత్రిలో చికిత్స చేశారు. అయితే చికిత్స చేస్తుండగానే సీరియస్ కావడంతో ఆమెను ఏలూరు తరలించాలని ఆసుపత్రి వైద్యులు సూచించారు. ఆమెను ఏలూరు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందారు. దీంతో ఆమె మృతదేహంతో కుటుంబసభ్యులు, బంధువులు అప్పట్లో ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా, ఆమె భర్త దుర్గారావు జిల్లా కలెక్టర్‌కు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై కృపాకుమారి మృతికి వైద్యులే కారణమని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలపై వైద్యశాఖాధికారులు సికిందర్ మోహన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజీవ్, ఏవో మురళీకృష్ణ శనివారం విచారణ చేపట్టారు. ఆసుపత్రి వైద్యులను , ఉపాధ్యాయురాలి కుటుంబసభ్యులను విచారించి, స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. దీనిపై కలెక్టర్‌కు, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ



బాలికల వసతిగృహంలో రికార్డులను తనిఖీ చేస్తున్న మేజిస్ట్రేట్ తేజస్వి

జంగారెడ్డిగూడెం : వసతిగృహంలో మెరుగైన వసతులు కల్పించి, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని బీసీ కళాశాల బాలికల వసతిగృహం వార్డెన్, సిబ్బందికి జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి సూచించారు. శనివారం జంగారెడ్డిగూడెం బీసీ కళాశాల బాలికల వసతిగృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో ఉన్న వసతులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. వార్డెన్‌లు, సిబ్బంది విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వార్డెన్ బి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొయ్యలగూడెం : చికిత్స పొందుతూ ఓ మహిళ మృతిచెందిన ఘటనపై ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం ఈ నెల 17వ తేదీన కొండ్రు నాగలక్ష్మి (24) ఇంటి వద్ద పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను రాజమండ్రి కిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందింది. మహిళ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.